క్లుప్తంగా

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా సుధాకర్

ప్రొద్దుటూరు క్రైం : ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా అమ్మలదిన్నె సుధాకర్ మాదిగ నియమితులయ్యారు. ఈ మేరకు సుధాకర్‌కు శనివారం కడపలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సువర్ణరాజు నియామక పత్రాన్ని అందచేశారు. దళితుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

ఒక్క మాత్రతో నులిపురుగుల నివారణ

ప్రొద్దుటూరు క్రైం : ఒక్క మాత్రతో నులిపురుగులను నివారించవచ్చని పీపీ యూనిట్ వైద్యాధికారి నజీర్‌బాషా తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా 14వ తేదీన మాత్రలు తీసుకోని విద్యార్థులకు శనివారం ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. టీబీరోడ్డులోని యూపీహెచ్‌సీ పరిధిలో ఉన్న పాఠశాలల విద్యార్థులకు ఈ మాత్రలను అందచేశారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి సునీల్‌కుమార్, హెల్త్ సెక్రటరి జ్యోతి, సిర్డ్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, పాఠశాల హెడ్‌మాస్టర్ ఖాసీం, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి చియ్యపాడులో ఆధార్ శిబిరం

చాపాడు: మండలంలోని చియ్యపాడు గ్రామంలో సోమవారం నుంచి రెండు రోజులపాటు ఆధార్ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి శ్రీధర్ నాయుడు తెలిపారు. 2010–216 సంవత్సరాల మధ్య ఆధార్ తీయించుకున్న ప్రతి ఒక్కరూ ప్రస్తుతం అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. వయస్సు, పేరు, చిరునామా తదితర మార్పుల కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుపై నేడు సమావేశం

మైదుకూరు : మైదుకూరులోని కడప రోడ్డులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నిలువెత్తు విగ్రహం ఏర్పాటుపై ఆదివారం సమావేశం నిర్వహిస్తున్నట్టు దళిత సంఘాల నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పుడున్న విగ్రహం స్థానంలో నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కుల, మతాలకతీతంగా అందరూ సహకరించాలని వారు కోరారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సమావేశంలో పాల్గొనాలని టి.చిట్టిబాబు, చిన్నమాధవయ్య కోరారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

గోపవరం : మండలంలోని బేతాయపల్లె పంచాయతీ పి.పి.కుంటలో శనివారం మినరల్ వాటర్ ప్లాంట్‌ను సర్పంచ్ ఓబుళంలక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోపవరం మల్లికార్జునరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఎంపీ గ్రాంటు కింద రూ.4 లక్షలతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ మేరకు ప్లాంట్‌ను ప్రారంభించి ప్రజలకు సురక్షిత మంచినీటిని అందుబాటులోకి తీసుకువచ్చారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు డైరెక్టర్ ఎస్.వెంకటసుబ్బారెడ్డి, సచివాలయ కన్వీనర్ పుల్లయ్య, ఎస్సీ సెల్ కన్వీనర్ తిరుపాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహారెడ్డి, దశరధరామిరెడ్డి, వెంకటేష, వెంకటరమణ, శ్రీకాంత్, ఉప సర్పంచ్ రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

దొరసానిపల్లెలో వైద్య శిబిరం

ప్రొద్దుటూరు క్రైం : మండల పరిధిలోని దొరసానిపల్లె సబ్‌సెంటర్‌లో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. కామనూరు పీహెచ్‌సీ వైద్యుడు శ్రీనివాసులు అక్కడికి వచ్చిన ప్రజలకు వైద్య సేవలు అందించారు. బీపీ, షుగర్, గుండె వ్యాధులతో పాటు, గర్భిణీలు, బాలింతలకు పరీక్షలు చేశారు. గర్భిణీలకు ఆల్బెండజోల్ మాత్రలను ఇచ్చారు. కార్యక్రమంలో 104 సర్వీస్ సిబ్బంది, హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి, సిబ్బంది శ్రీనివాసులు, దివ్య, సుప్రజ, సుజాత, పుష్ప, లక్ష్మి, దేవి, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రారంభమైన చౌడేశ్వరీదేవి ఉత్సవాలు

వల్లూరు : మండలంలోని వెంకటాపురం వీవర్స్ కాలనీలోని చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గ్రామంలో చల్ల కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామ దేవతలకు పూజలు నిర్వహించారు. భక్తులు మొక్కుల ను తీర్చుకున్నారు. అమ్మవారి అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తులు ఆలయంలో జ్యోతుల తయారీని ప్రారంభించారు.

ఉచిత శిక్షణ

కడప కార్పొరేషన్: కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేర్స్, సర్వీసింగ్(30 రోజులు) కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఎన్. నారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 18–45 ఏళ్లలోపు ఉన్న గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకులు ఈ శిక్షణకు అర్హులన్నారు. మార్చి 20వ తేది నుంచి శిక్షణ ప్రారంభం కానుందని, ఆసక్తిగల వారు తిరుపతి రోడ్డులో గర్ల్స్ ఐటీఐ పక్కనున్న తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. వివరాలకు 9440905478, 6302833546 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

వైభవం.. వీరభద్రుని గ్రామోత్సవం


భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

బద్వేలు అర్బన్ : స్థానిక పోరుమామిళ్ల రోడ్డులోని శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయ అష్టమ వార్షికోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన స్వామివార్ల గ్రామోత్సవం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి పురవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో గణపతిపూజ, రుద్రాభిషేకం, రుద్రహోమం, నవగ్రహ హోమం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత ధర్మకర్త ప్రొద్దుటూరుకిషోర్ కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ దేవతిసురేంద్ర, సెక్రటరీ వడ్లపూటినాగభూషణం, ట్రెజరర్ ఆంజనేయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రతనాల వేంకటేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాత మార్కెట్‌లోని రతనాల వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణ పర్వదిన సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువ జామున స్వామివారి మూల విరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా గజమాల, తులసీమాలలతో అలంకరించారు. అలాగే లలితాదేవికి, శ్రీదేవిభూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మహిళలు సామూహికంగా కుంకుమార్చనలు, విష్ణుసహస్రనామ పారాయణం చేసి భక్తి గీతాలను ఆలపించారు.

లక్ష్మీనరసింహస్వామికి..


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో కొలువైన స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాల్గుణ మాసం నాల్గవ శనివారం శ్రావణ నక్షత్రం సందర్భంగా వేకువ జాము నుండే స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు. భక్తుల దర్శనం కోసం స్వామి వారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. వచ్చిన భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ప్రొద్దుటూరులో భారీ వర్షం


మురికి కాలువలో అడ్డుపడిన చెత్తను తొలగింపజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ప్రాంతంలో శనివారం ఉదయం, సాయంత్రం భారీ వర్షం పడింది. దీంతో పట్టణంలోని రోడ్లన్నీ జలమయం అయ్యాయి. పట్టణంలోని గాంధీ రోడ్డు, టీబీ రోడ్డు, శివాలయం వీధి, కొర్రపాడు, మైదుకూరు రోడ్లపై కాలువలు పొంగి వర్షం నీరు ప్రవహించింది. పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వెంటనే స్పందించిన మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి పట్టణంలోని ఆయా ప్రాంతాలను సందర్శించి మున్సిపల్ సిబ్బందితో డ్రైనేజి కాలువలో అడ్డు పడిన చెత్తను తొలగించి నీరు సాఫీగా వెళ్లేలా చేశారు.

రోడ్డు ప్రమాదాల కేసుల్లో నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న ఆరవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఇంతియాజ్ అహ్మద్


పాల్గొన్న పోలీసు, రోడ్డు రవాణా, ఆర్టీసీ అధికారులు, న్యాయవాదులు

- జిల్లా న్యాయమూర్తి ఇంతియాజ్ అహ్మద్

కడప అర్బన్: రోడ్డు ప్రమదాల కేసుల్లో ప్రస్తుతం సవరించిన నిబంధనలను పాటించాలని ఆరవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఇంతియాజ్ అహ్మద్ అన్నారు. శనివారం కడపలోని జిల్లా కోర్టు ఆవరణలో న్యాయసేవాసదన్‌లో పోలీసు, రోడ్డు రవాణా, న్యాయవాదులు, న్యాయశాఖ ఉద్యోగులతో రోడ్డు ప్రమాదాల నియంత్రణ, ప్రమాదాలు జరిగినపుడు తీసుకునే చర్యలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి, ఇన్‌ఛార్జ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, డీఎల్ఎస్ఏ ఇన్‌ఛార్జ్ చైర్మన్ జి. గీత, డీఎల్ఎస్ఏ ఇన్‌ఛార్జ్ సెక్రటరీ, జడ్జి ఎస్. హేమలత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ మోటారు వాహన సవరణ చట్టం, మోటార్ వాహన సవరణ నియమాలు– 2022 లోని అధ్యాయాలు, 11,12లోని నిబంధనలు, ఉచిత న్యాయసహాయం, రోడ్డు ప్రమాదాల కేసుల్లో పాటించాల్సిన నియమాలు తదితర అంశాలను వివరించారు. నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రామలింగారెడ్డి, ప్రభుత్వ ప్లీడరు శివశంకర్ రెడ్డి, న్యాయవాదులతో పాటు, పోలీసు అధికారులు, రోడ్ రవాణా సంస్థ అధికారులు, ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

బొగ్గులు అక్రమ రవాణా


స్వాధీనం చేసుకున్న బొగ్గుల లారీ

- 60 బస్తాల బొగ్గులతో సహా లారీ స్వాధీనం

ప్రొద్దుటూరు క్రైం : అనుమతి లేకుండా తరలిస్తున్న బొగ్గుల లారీని ప్రొద్దుటూరు అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. డిప్యూటీ రేంజర్ లక్షుమయ్య కేసు వివరాలను వెల్లడించారు. బొగ్గుల లారీ కమలాపురం వైపు వెళ్తోందని సమాచారం రావడంతో శనివారం డీఆర్‌ఓ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడిలో లారీతోపాటు అందులో ఉన్న 60 బస్తాల బొగ్గులను స్వాధీనం చేసుకున్నారు. వీటికి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో బొగ్గులతో సహా లారీని సీజ్ చేసి ప్రొద్దుటూరులోని అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. స్వాధీనం చేసుకున్న బొగ్గుల విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు డీఆర్‌ఓ లక్షుమయ్య తెలిపారు. కాగా స్వాధీనం చేసుకున్న లారీ, బొగ్గులు ప్రొద్దుటూరు మండలంలోని అమృతానగర్‌కు చెందిన నాగమునిరెడ్డికి చెందినవిగా అధికారులు తెలిపారు. విచారణ చేసి తగు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతి లేకుండా బొగ్గుల బట్టీలను నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని డీఆర్‌ఓ లక్షుమయ్య హెచ్చరించారు. దాడుల్లో డీఆర్‌ఓతోపాటు కమలాపురం, ప్రొద్దుటూరు ఎఫ్‌బీఓలు రమేష్, శ్రీహరి, ఏబీఓ ఉషా పాల్గొన్నారు.

అన్నమయ్యకు ఘన నివాళి


అన్నమయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న అన్నమయ్య కళాపీఠం సభ్యులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఉపాధ్యాయ సేవా కేంద్రంలో శనివారం తాళ్లపాక అన్నమయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి అన్నమయ్య కళాపీఠం సభ్యులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అన్నమయ్య రచించిన సంకీర్తనల గొప్పదనాన్ని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో అన్నమయ్య కళాపీఠం కార్యదర్శి యడవల్లి రమణయ్య, బూతూరు వెంకటరామిరెడ్డి, నరేష్ యాదవ్, బోగా గంగాధర్, అంకాల్ కొండయ్య, సాయికుమార్, శ్రీధర్, మాదాసు మురళి, శ్రీధర్ రెడ్డి, గురుమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఎస్ హాస్పిటల్ ప్రారంభం


పూజలు చేస్తున్న డాక్టర్లు సుధేష్ణ, శ్రీనివాసులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక హోమస్ పేట పాండురంగస్వామి ఆలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఎస్ హాస్పిటల్‌ను శనివారం డాక్టర్ ఏజీఎస్ సుధేష్ణ, డాక్టర్ కె.శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా గణపతి, కలశ పూజా కార్యక్రమాలు చేశారు. డాక్టర్ సుధేష్ణ మాట్లాడుతూ గుండె సంబంధిత వ్యాధులు, గ్యాస్ట్రబుల్, కామెర్లు, పక్షవాతం, తిమ్మిర్లు, విష జ్వరాలు, థైరాయిడ్ సంబంధిత జబ్బులకు వైద్యం అందిస్తామని తెలిపారు. డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ చిన్న పిల్లలు, నవజాత శిశువులకు అత్యాధునిక ఎన్ ఐసీయూ సౌకర్యం, పురిటి పిల్లల కామెర్లకు ఆధునిక ఫొటో థెరపి, సెంట్రల్ ఆక్సిజన్ సౌకర్యం ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు ప్రముఖ డాక్టర్లు, ప్రముఖులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ


సీఎం సహాయ నిధి చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రాదరెడ్డి

ప్రొద్దుటూరు : ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం రాష్ట్రంలోని ప్రజల ఆరోగ్యాలకు ఒక సంజీవని లాంటిదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవితో కలసి ఎమ్మెల్యే రాచమల్లు 12 మందికి సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 12 మందికి సీఎం సహాయ నిధి ద్వారా రూ.18.43 లక్షల చెక్కులను అందించినట్లు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన నందకిశోర్‌కు కిడ్నీ మార్పిడికి సీఎం సహాయ నిధి కింద రూ.4లక్షలు ఆర్థిక సహాయం అందించారంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానవత్వం ఎలాంటిదో అర్థమవుతోందన్నారు.

ఆరోగ్యశ్రీ ద్వారా లబ్ధి పొందని పేషెంట్లు తమ సొంత డబ్బుతో ఖర్చు పెట్టుకుని వైద్యం చేయించుకుని బిల్లులు తనకు ఇస్తే, ఎమ్మెల్యే లెటర్ హెడ్‌పై ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేస్తామన్నారు. అక్కడి డాక్టర్లు పరిశీలించి సీఎం సహాయ నిధి మంజూరు చేస్తారని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, పాతకోట మునివంశీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కాకర్ల నాగేశ్వారెడ్డి, బండి మధుసూదన్ రెడ్డి, దొరసానిపల్లె ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు


మాట్లాడుతున్న కేవీకే అధిపతి శ్రీవిద్యారాణి

మైదుకూరు : ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో చిరుధాన్యాలను సాగు చేస్తే నాణ్యతతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త శ్రీవిద్యారాణి అన్నారు. అంతర్జాతీయ సదస్సులో భాగంగా శనివారం కేవీకేలో 'ప్రకృతి వ్యవసాయంలో చిరుధాన్యాల సాగు' అనే అంశంపై శిక్షణ, సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుతో రైతులు తక్కువ పెట్టుబడితో మంచి ఆదాయం పొందవచ్చన్నారు. గృహ విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త కాంతిశ్రీ మాట్లాడుతూ రైతులు తమకున్న భూమిలో కొంత భాగం చిరుధాన్యాల సాగుకు కేటాయించాలని సూచించారు. శాస్త్రవేత్తలు హర్షిత, ఫిరోజ్ హుస్సేన్ మాట్లాడుతూ పోషకాలతో నిండిన చిరుధ్యానాల సాగుతో నేల ఆరోగ్యంగా మారడంతోపాటు తినడం వల్ల అందరూ ఆరోగ్యంతో ఉండవచ్చని తెలిపారు. సదస్సులో కోరమండల్ మేనేజర్ గంగయ్య, రైతు సహకార సంఘం అధ్యక్షుడు బాలనరసింహారెడ్డి, ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలపై 'చలో విజయవాడ'


వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ యూనియన్ నేతలు

పోరుమామిళ్ల: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 20 న విజయవాడలో జరుగుతున్న మహాధర్నాలో పాల్గొనేందుకు పోరుమామిళ్ల నుంచి అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు తరలిరావాలని ఆ యూనియన్ లీడర్లు ఓబులాపురం విజయమ్మ, జ్యోతి పిలుపిచ్చారు. శనివారం సీఐటీయు జిల్లా కమిటీ సభ్యులు భైరవప్రసాదుతో కలసి ఐసీడీఎస్ కార్యాలయంలో సూపర్‌వైజర్లు హరిప్రియ, ప్రత్యూషలకు వినతి పత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, రెగ్యులర్ చేయాలని, పీయఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలని, పెన్షన్, బీమా తదితర సదుపాయాల అమలు కొరకు చాలాకాలంగా విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఇప్పుడు జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లో తమ సమస్యలు గుర్తించేందుకు విజయవాడలో ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు జయమ్మ, ప్రభావతి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి అరవిందనాయక్

గోపవరం : చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించాలని మండల వ్యవసాయాధికారి అరవింద నాయక్, ఎంపీడీఓ హరినారాయణలు తెలిపారు. శనివారం మండల సమాఖ్య కార్యాలయంలో చిరుధాన్యాల మహోత్సవంపై సమాఖ్య సభ్యులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ అంతర్జాతీయ ప్రముఖులతో చిరుధాన్యాల విశిష్టతపై సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చిరుధాన్యాల సాగుపై మహిళా రైతు సంఘాలు అవగాహన పెంచుకుని ఎక్కువ విస్తీర్ణంలో వచ్చే ఖరీఫ్ సీజన్‌లో చిరుధాన్యాల సాగు చేసే విధంగా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. 10 నుండి 12 మంది సభ్యులు గ్రూపులుగా ఏర్పడి చిరుధాన్యాల సాగు, ప్రభుత్వం అందించే పథకాలను రైతులకు వివరిస్తూ వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. చిరుధాన్యాలు వాడటం వలన పిల్లలకు, పెద్దలకు మంచి పౌష్టికాహారం లభిస్తుందన్నారు. చిరుధాన్యాలు తిందాం – ఆరోగ్యంగా ఉందాం అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీఎం శివప్రసాద్, ఐకెపీ సభ్యులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

డివిజనల్ అభివృద్ధి అధికారి వెంగమునిరెడ్డి


నరసాపురం సచివాలయంలో ఉద్యోగులతో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ వెంగమునిరెడ్డి

కాశినాయన : సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డివిజనల్ అభివృద్ధి అధికారి వెంగమునిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని నరసాపురం, గంగనపల్లె గ్రామ సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతూ ప్రతిరోజు సాయంత్రం 3 నుండి 5 గంటల వరకు గ్రీవెన్స్‌సెల్‌లో ప్రతి ఉద్యోగి పాల్గొనాలన్నారు. అలాగే సచివాలయ రెవెన్యూ అధికారులు కూడా తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. అనంతరం సచివాలయాల్లోని రికార్డులను పరిశీలించారు. అన్నిశాఖల ఉద్యోగులకు అప్పగించిన పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ముజఫర్‌రహీమ్, ఆయా గ్రామ సచివాలయ ఉద్యోగులు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు


స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రవణానక్షత్రం సందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, అలంకారం చేసి ప్రత్యేక పీఠంపై కొలువుదీర్చారు. అనంతరం కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించి అర్చకులు మచ్చా శేషాచార్యులు, మయూరం కృష్ణమోహన్‌లు మహా మంగళ సూత్రాలను భక్తులకు దర్శింపజేసి స్వామి పక్షాన అమ్మవారి గళసీమలో అలంకరించారు. ఉభయ దారులతో పూజలు నిర్వహింపజేసి వారితోపాటు భక్తులందరికీ తీర్థప్రసాదాలను అందజేశారు.

భక్తిశ్రద్ధలతో షహమీరియా దర్గా ఉరుసు


గంధం కలశాన్ని తీసుకున్న వస్తున్న పీఠాధిపతి

కడప కల్చరల్ : స్థానిక రవీంద్రనగర్‌లోని అస్తానె షహమీరియా దర్గా ఉరుసు ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. దర్గాలోని హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా అబ్దుల్ హఖ్ ఉరఫ్ షహమీర్ బాష సాహెబ్ చిష్తివుల్ ఖాద్రి ఉరుసు ఉత్సవాలలో భాగంగా రాత్రి అస్తానె షహమీరియా దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా హుసేనీబాష షహమీరియా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తొలుత తన ఇంటినుంచి గంధం కలశాన్ని ఫకీర్ల మేళతాళాలు, బ్యాండు మేళాల మధ్య దర్గా వద్దకు చేర్చారు. దర్గా గురువుల మజార్ వద్ద పూలచాదర్ సమర్పించి ఫాతెహా చేసి గంధం సమర్పించారు. భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉత్తమ గ్రేడ్ సాధనకు కృషి


విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందచేస్తున్న సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: పదవ తరగతిలో ప్రతి విద్యార్థి ఉత్తమ గ్రేడును సాధించేందుకు కష్టపడి చదవాలని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కడపలోని చెమ్మియాపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు మేరీ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తెరిగి చదవాలన్నారు. చదువు ఒక్కటే మనకు గుర్తింపు తెస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందచేశారు. కడప ఎంఈఓ పాలెం నారాయణ, సీకెదిన్నె ఎంఈఓ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.